క్లుప్తంగా

మృదంగ విద్వాంసుడు సత్యం మృతి


వెంపడాపు సత్యం (ఫైల్)

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ మృదంగ విద్వాంసుడు వెంపడాపు సత్యం (76) మంగళవారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కోలంక వెంకటరాజు, కాట్రేవులపల్లి వీరభద్రరావుల శిష్యుడు. హరికథకు ఈయన అందించిన మృదంగ సహకారం ఎనలేనిది. సత్యం మృతి పట్ల సంగీత, సాహిత్య ప్రముఖులు అప్పలస్వామి, డాక్టర్ మండపాక రవి, రాధాకృష్ణ, మహేశ్వరరావు, కాళ్లనిర్మలా భాగవతారిణి, త్రినాథరావు, సుబ్బరాజు, తదితరులు సంతాపం తెలియజేశారు.

కార్పెంటర్లకు సత్కారం


సీనియర్ కార్పెంటర్లను సత్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

విజయనగరం టౌన్: కార్పెంటర్స్ డే పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో 350 మంది కార్పెంటర్లను యాక్షన్ టెసా సంస్థ ప్రతినిధులు , శివ్వా జగన్నచెట్టి హార్డ్‌వేర్ సంస్థ ప్రతినిధులు సంయుక్తంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి వై.జనార్దనరెడ్డి మాట్లాడుతూ.. నిర్మాణ పరిశ్రమకు నిశ్శబ్ద సేవలు అందిస్తున్న కార్పెంటర్లను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వాసుపల్లి శామ్యూల్, శివనారాయణమూర్తి, శివ, జగన్, అధిక సంఖ్యలో కార్పెంటర్లు పాల్గొన్నారు.

అద్దె బకాయిలు చెల్లించండి


దుకాణదారులతో మాట్లాడుతున్న నగరపాలక సిబ్బంది

విజయనగరం: నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అద్దెను వెంటనే చెల్లించాలని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు అన్నారు. ఐడీఎస్ఎంటీ, న్యూ ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో బుధవారం పర్యటించి, అద్దె బకాయిలున్న వారు వెంటనే చెల్లించాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అద్దెలు సకాలంలో చెల్లించి, కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. బకాయిదారులకు నోటీసులు అందజేశామని, వారు స్పందించకపోతే దుకాణాలను సీజ్ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓను అభినందిస్తున్న సహచర సిబ్బంది

భోగాపురం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీఓ) డీడీ స్వరూపరాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేస్తానని తెలిపారు. అనంతరం పలువురు సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సాయం


విద్యార్థులకు ఆర్థికసాయం చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: నేషనల్ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి బుధవారం ఆర్థిక సహాయం అందించారు. మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు వెళ్తున్న రెడ్డి కావ్య, కెల్ల భువనేష్‌లకు నగదు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించి, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ శేఖర్ పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని రాయుడుపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు భోగాపురం ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామంలో బుధవారం తనిఖీలు చేపట్టగా, నిందితుడి నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎస్సై చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

పులకించిన కొండతామరాపల్లి..


పైడితల్లి సిరిమాను చెట్టు


ఒరిగిపోతున్న సిరిమాను చెట్టు


సిరిమాను చెట్టు ప్రాంతంలో జన సందోహం


ముర్రాటలతో వస్తున్న భక్తులు

పైడితల్లి జాతరకు సంబంధించిన సిరిమాను చెట్టును గంట్యాడ మండలం కొండతామరాపల్లిలో గుర్తించారు. అమ్మవారు పూజారి కలలో కనిపించి సిరిమాను ఎక్కడుందో చెప్పడంతో పూజారి, ఆలయ సిబ్బంది చెట్టును గుర్తించారు. ఈ మేరకు ముహూర్తం ప్రకారం సిరిమాను చెట్టుకు బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పూజల్లో పాల్గొని గొడ్డలితో గాట్లు పెట్టారు. భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడంతో కొండతామరాపల్లి పులకించిపోయింది. చెట్టుకు ముర్రాటలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. చెట్టు కొట్టిన తర్వాత తరలింపు సమయంలో కూడా సిరిమానుపై పసుపు, కుంకుమలు, ముర్రాటలు వేసి భక్తులు పులకించిపోయారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అన్నపూర్ణగా దుర్గమ్మ


అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న వనంగుడిలో కొలువైన దుర్గాదేవి


అన్నపూర్ణాదేవిగా కనకమహాలక్ష్మి


గాజులరేగలో శాకంబరీ మాతగా దుర్గమ్మ

విజయనగరం టౌన్: శరన్నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వనంగుడిలో కొలువైన దుర్గాదేవిని వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయికిరణ్ అన్నపూర్ణమ్మగా అలంకరించి, శ్రీచక్ర కుంకుమార్చనలను నిర్వహించారు. అలాగే సిటీ బస్టాండ్ వద్దనున్న కనకమహాలక్ష్మి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా.. గాజులరేగలో కొలువైన అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకున్నారు.

వినతులపై సానుకూలంగా వ్యవహరించాలి

- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్: ప్రజలు తెలియజేసిన రెవెన్యూ వినతులపై సానుకూలంగా వ్యవహరించాలని కలెక్టర్ ఎస్. రామ్‌సుందరరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, రీ సర్వే, పీజీఆర్ఎస్, హౌస్‌సైట్స్, మ్యుటేషన్స్, ఆర్ఓ, తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితాతో 2025 ఓటర్ల జాబితాను మ్యాప్ చేయాలన్నారు. మండల స్థాయి అధికారులు ఈ ఆఫీస్ ద్వారా ఉత్తర, ప్రత్యుత్తరాలు చేయాలని, దీనివల్ల రికార్డులు భద్రంగా ఉంటాయని చెప్పారు. సమావేశంలో జేసీ సేదుమాధవన్, డీఆర్ఓ శ్రీనివాసమూర్తి, ఆర్డీఓలు, డిప్యూటీ కలెక్టర్లు, సర్వే ఎ.డి, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

వరి పంటలో పొటాష్ లోపం

- ఏఓ సంగీత


రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఓ సంగీత

డెంకాడ: వరి పంటలో పొటాష్ లోపం గుర్తించామని మండల వ్యవసాయాధికారి టి.సంగీత అన్నారు. మండలంలోని పినతాడివాడలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి వరి పొలాన్ని పరిశీలించారు. అనంతరం వరిలో చేపట్టాల్సిన సస్యరక్షణపై అవగాహన కల్పించారు. పొటాష్ లోప నివారణకు ఎకరాకు 15 నుంచి 20 కిలోల పొటాష్ ఎరువు వేయాలని సూచించారు. అలాగే వరికి పాముపొడ తెగులు కూడా సోకిందని.. దీని నివారణకు లీటర్ నీటిలో రెండు మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ మందు.. లేదా లీటర్ నీటిలో ఒక మిల్లీలీటర్ ప్రొపికొనజోల్ మందు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అచ్చంనాయుడు, ఏఈఓ రామకోటి, వ్యవసాయ సహాయకుడు రాంబాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మీ సహకారం మరువలేనిది

- కమాండెంట్ మలికాగార్గ్


కమాండెంట్ మలికాగార్గ్‌కు స్వాగతం పలుకుతున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు

డెంకాడ: చింతలవలస ఐదో ఏపీఎస్పీలో పనిచేసిన కాలం మరువలేనిదని..బదిలీపై వెళ్లిన మలికాగార్గ్ అన్నారు. మలికాగార్గ్‌కు ఇటీవల ఏపీ టెక్నికల్ సర్వీస్ విభాగానికి బదిలీ జరిగింది. ఈ నేపథ్యంలో ఏపీఎస్పీ అధికారులు, సిబ్బంది ఆమెను బుధవారం ఘనంగా సత్కరించారు. ముందుగా స్థానిక బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో ఆమెకు స్వాగతం పలికి, అనంతరం యూనియన్ ఫంక్షన్ హాల్‌లో సన్మానసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెటాలియన్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించి, తనకు ఎంతో సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సి.రాజారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు సీవీ ప్రభాకరరావు, డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ బాపూజీ, ఎం.గోపాలకృష్ణ, ఎస్.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే హిందీ బోధన

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే హిందీ భాషా బోధన ప్రవేశపెట్టాలని హిందీ మంచ్ నాయకులు డిమాండ్ చేశారు. హిందీ పక్షోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక శ్రీసరస్వతి శిశుమందిర్‌లో జరిగిన సభలో హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనే శ్రీధర్, జిల్లా అధ్యక్షురాలు పి.ఉమాబాల, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జాతీయ భాష హిందీని ప్రాథమిక స్థాయి నుంచే బోధించడం సముచితమన్నారు. అనంతరం ప్రముఖ హిందీ ఉపన్యాసకులు, పండితులు దేవరకొండ రామచంద్రరావు, రిటైర్డ్ కల్నల్ మూర్తి, కనుకుల సత్యం, రొంపివలస రామారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిశుమందిర్ ప్రధానోపాధ్యాయులు టి.రామారావు, మంచ్ కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రత్నం, ఎన్.చిన్నదేవి, ఎస్.సంతోషి, ఛాయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంఘ సభ్యులకు రుణాలు

విజయనగరం ఫోర్ట్: సంఘ సభ్యులకు రుణాలు ఇవ్వనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎంప్లాయీస్ కో ఆపరేటింగ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు పి.రామునాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక దాసన్నపేట విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 కార్యాలయంలో సొటీ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఉద్యోగులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. అలాగే సిబ్బంది పిల్లలు చదువులో బాగా రాణిస్తే ప్రోత్సాహకాలు కూడా అందిస్తామని చెప్పారు. సంఘ సభ్యులు చనిపోతే దహన సంస్కారాలకు రూ. 10 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి బి.రామారావు, పూర్వపు అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, 1104 యూనియన్ కార్యదర్శి సురగాల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను రద్దు చేయాలి



ఇంటి పన్ను రద్దు చేయాలంటూ సచివాలయం వద్ద సీపీఎం నాయకుల ధర్నా

- సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్

విజయనగరం గంటస్తంభం: పెంచిన ఇంటి పన్నును రద్దు చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. ఈ మేరకు నగరంలోని 45వ డివిజన్ పరిధి 55వ సచివాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిసెలు, రేకుల ఇళ్లల్లో జీవనం సాగిస్తున్నవారికి రూ. 54 మాత్రమే పన్ను వేయాల్సి ఉండగా.. అధికారులు వేలాది రూపాయల పన్ను వేస్తున్నారని చెప్పారు. ధర్నా అనంతరం సచివాలయ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త భవనంలోకి డిగ్రీ కళాశాల


కొత్త భవనంలోకి ప్రవేశిస్తున్న ప్రిన్సిపాల్ కె.రేఖ, తదితరులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని సంస్కృత కళాశాల ప్రాంగణంలో ఉన్న విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల నెల్లిమర్లలోని మిమ్స్ ఆస్పత్రి సమీపాన ఉన్న డ్వామా భవనంలోకి బుధవారం మారింది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ అధ్యక్షతన బుధవారం వేదమంత్రోచ్ఛారణల నడుమ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దసరా సెలవుల అనంతరం వచ్చే నెల 6వ తేదీ నుంచి కొత్త భవనంలో తరగతులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జనార్దననాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.అప్పారావు, డాక్టర్ జీవీఎస్ జమపాల్ రావు, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రూపవాణి, డాక్టర్ రమాగీతాదేవి, ఆర్.ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పీ 4

- నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య


పీ 4 కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ఆర్థిక స్వావలంబన చేకూర్చే విధంగా ప్రభుత్వం పీ 4 విధానాన్ని అమలు చేస్తోందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. పీ 4ను మరింత సమర్థవంతంగా అమలు చేసే విధానంపై వెల్ఫేర్, శానిటేషన్, ఉమెన్ ప్రొటెక్షన్, హెల్త్, ఎడ్యుకేషన్ కార్యదర్శులకు బుధవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సాధికారతకై ప్రభుత్వం పీ 4 కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో నగరపాలక సంస్థ పరిధిలో 3,760 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు చెప్పారు. వివిధ రూపాలలో సహాయాన్ని అందించేందుకు 299 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చారన్నారు. ఒక్కో మార్గదర్శి ఐదు కుటుంబాలను దత్తత తీసుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు 1,363 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని, ఇంకా 2,397 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో టీపీఆర్ఓ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు అలవర్చుకోవాలి

- ఐఎంఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు


డాక్టర్ జయచంద్రనాయుడును సత్కరించి మొక్క అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీమాధవి

విజయనగరం ఫోర్ట్: వైద్య విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జయచంద్రనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రోగి బాధను అర్థం చేసుకుని వైద్యం అందించాలన్నారు. రోగులతో ప్రేమగా, ఆప్యాయంగా మాట్లాడాలని సూచించారు. వైద్య వృత్తిని సేవా దృక్పథంతో చూడాలే తప్ప వ్యాపార దృక్పథం పనికిరాదని స్పష్టం చేశారు. అనంతరం నిర్వాహకులు ముఖ్య అతిథిని సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ దేవీమాధవి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిదే కీలకపాత్ర


మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

భోగాపురం: పేదరికాన్ని నిర్మూలించడంలో, వెనుకబడిన కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడంలో సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సచివాలయ సిబ్బందికి పీ 4 కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రతి పేద కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూడాలన్నారు. పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పాటు ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం


ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డి.రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ, సీతం ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త నిర్వహణలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం-2025 స్థానిక జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణంలో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విలువలు, లక్ష్యాలను గ్రహించి సమాజానికి నిస్వార్థంగా సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ఆర్.రాజేశ్వరరావు, సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మణికుమార్, జిల్లా నోడల్ ఆఫీసర్ ఎస్.సతీష్‌కుమార్, సీతం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్‌వీఎన్ రాజు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన రుచులు


రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: వినియోగదారులకు నాణ్యమైన రుచులు అందించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు సూచించారు. మండలంలోని చోడమ్మ అగ్రహారం రెవెన్యూ పరిధిలో గల మైలాన్ పరిశ్రమ సమీపంలో డీఆర్‌టీ రెస్టారెంట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో లోకం ప్రసాద్, మహంతి చిన్నంనాయుడు, మహంతి శంకరరావు, పతివాడ లాయర్ అప్పలనాయుడు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం వైస్ సర్పంచ్ బాలా అప్పలరాజు, ఎడ్ల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో మెరిసిన సత్య విద్యార్థులు


విజేతలతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: విశాఖలోని మధురవాడలో ఇటీవల జరిగిన 5వ ఎస్ఎస్‌కేఏఐ సౌత్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ - 2025 పోటీల్లో సత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు మెరిశారు. కోచ్ కే.సంతోషి శిక్షణలో కాటా, కుంతి విభాగాలలో పోటీ పడి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. విజేతలలో ఎస్.శ్రీవత్సల్, కె.శివగణేష్, ఎస్.జనని, ఎం.యోగిత, పి.కుశ్వంత్‌కుమార్, సీహెచ్ రిషిత, కె.స్నేహ, జి.వివేక్ వర్మ, ఎస్.నవ్య, ఇందిరా ప్రియదర్శిని, ఆర్.వైష్ణవి, కె.మోహన్‌చంద్ర, బి.వివాస్, జె.శరత్ ఉన్నారు. విజేతలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయి దేవమణి అభినందించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి


పౌష్టికాహార మాసోత్సవంలో పాల్గొన్న ఆరోగ్య కార్యకర్తలు, ఆయాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు

భోగాపురం: ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సిబ్బంది అన్నారు. మండల పరిధిలోని భోగాపురం -2 సచివాలయంలో బుధవారం పౌష్టికాహారం మాసోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.